ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 38.0
కనిష్ఠం 24.4

ANDHRAJYOTHY



యాదాద్రి భువనగిరి

3

గురువారం 20 జూన్ 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	504.50 (122.5225)	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.45 (2.68)	316	నిల్
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	94.88 (0.41)	479	1394

చికెన్ ధరలు | లైవ్ :రూ.168 | డ్రెస్ :రూ.260 | స్కిన్‌లెస్ : రూ.290

ఏళ్ల తరబడి చదువులు. నెలల కొద్దీ కోచింగ్ సెంటర్ల చుట్టూ ప్రదక్షిణలు చేసే తిప్పలు తప్పనున్నాయి. ఇక ఐటీఐల స్థానంలో ఏటీసీలను ప్రభుత్వం ఏర్పాటు చేయనుండడంతో కోర్సు పూర్తి చేసిన వెంటనే ఉద్యోగ, ఉపాధి అవకాశం రానుంది. మొత్తం ఆరు కోర్సులను కొత్తగా ప్రవేశపెడుతుండడంతో ఈ కోర్సులపై ఇప్పటికే అధ్యాపకులకు శిక్షణ సైతం పూర్తయింది. ఈ కోర్సులతో ఏడాదికి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 4వేల మంది లబ్ధి పొందనున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)



నల్లగొండ జిల్లాకేంద్రంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌గా మారనున్న ఐటీఐ

తక్షణ ఉద్యోగ, ఉపాధి కల్పనే లక్ష్యం

- ప్రతి ఏటీసీలో ఆరు కోర్సులు
- ఉమ్మడి జిల్లాలో ఏడు ఐటీఐల స్థానంలో ఏటీసీల ఏర్పాటు
- ఏటీసీగా మార్చేందుకు ఒక్కోదానికి రూ.34 కోట్ల వ్యయం
- ఈ ఏడాది నుంచే కొత్తకోర్సుల నిర్వహణ
- విదేశాల్లోనూ ఉద్యోగావకాశాలకు ఛాన్స్

విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగాలు నేరుగా లభించేందుకు అనుగుణంగా ఐటీఐలను ఆధునికీకరించే ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. ఇప్పటివరకు ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్లు (ఐటీఐ)గా కొనసాగుతున్న వాటిని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు (ఏటీసీ)గా మార్చబోతోంది. టాటా టెక్నాలజీస్ లిమిటెడ్(టీటీఎల్)తో కలిసి ఈ సెంటర్లను ఏర్పాటుచేసి విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. దీర్ఘ, స్వల్ప కాలిక కోర్సులను ఈ కేంద్రాల్లో అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా 65 ఐటీఐలను ఏటీసీలుగా మారుస్తుండగా, ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఏడు ఐటీఐల స్థానంలో ఏటీసీలు ఏర్పాటవుతున్నాయి. ఒక్కో ఏటీసీలో ఆరు రకాల ఆధునిక కోర్సులను ప్రవేశపెట్టబోతున్నారు. ఈ కోర్సుల్లో శిక్షణ పూర్తయ్యాక టీటీఎల్ సహా అరబ్ దేశాలు, దేశీయ ఐటీ, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ కంపెనీల్లో తక్షణం ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కూడా ఏటీసీలే బాధ్యత తీసుకుంటాయని ప్రభుత్వం పేర్కొంటుండడం ఏటీసీలకు ప్రభుత్వం ఇస్తోన్న ప్రాధాన్యాన్ని తెలియజేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా దీర్ఘ కాలిక కోర్సుల ద్వారా ప్రతీ సంవత్సరం 5,860 మంది, స్వల్పకాలిక కోర్సుల ద్వారా 31,200 మందికి ఈ ఏటీసీల్లో శిక్షణ అందితే, ఉమ్మడి జిల్లాలో దీర్ఘకాలిక కోర్సుల ద్వారా ఏటా 854 మందికి, స్వల్పకాలిక కోర్సుల ద్వారా 3,360 మంది విద్యార్థులకు శిక్షణ అందుతుందని అంచనా వేస్తున్నారు.

రూ.34కోట్ల వ్యయంతో..

ఏటీసీగా మారుస్తున్న ప్రతీ ఐటీఐకి ప్రస్తుతం ప్రవేశపెడుతున్న కోర్సులకనుగుణంగా అవసరమైన ఇన్‌స్ట్రక్టర్ల నియామకాలతోపాటు, శిక్షణకు అవసరమైన వర్క్‌షాపులు, సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ, ఇతర సామగ్రి, సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు రాష్ట్రవ్యాప్తంగా రూ.2,324.21 కోట్లు ఖర్చుచేస్తుండగా, ఇందులో టీటీఎల్ సంస్థ 86.74శాతం భరిస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం 13.26శాతం భరిస్తోంది. ఒక్కో ఏటీసీకి సగటున రూ.34కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. రాబోయే పదేళ్లవరకు ఈ ప్రాజెక్టు అమల్లో ఉండనుంది. వీటిద్వారా వచ్చే పదేళ్లలో నాలుగు లక్షల మందికి ఉపాధి, ఉద్యోగ కల్పన నిమిత్తం శిక్షణ అందిస్తామని ఈసంస్థ ప్రతినిధులు పేర్కొంటున్నారు.

విద్యార్థులకు ఉపయుక్తమైన శిక్షణ



ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐలన్నింటినీ ఏటీసీలుగా మార్చడం అభినందనీయం. ఈ కోర్సుల శిక్షణ ద్వారా ఆధునిక ప్రపంచంలో తక్షణం ఉపాధి, ఉద్యోగం పొందేందు కు విద్యార్థులకు ఉపయోగపడుతుంది. ఇక్కడున్న ఏడు ఏటీసీలలో కొత్త కోర్సుల ఏర్పాటుకు కార్యాచరణ మొదలయింది. ఈ విద్యాసంవత్సరం నుంచే కోర్సులు ప్రారంభమవుతాయి. ఇంటర్‌స్థాయిలోనే విద్యార్థులు తక్షణం ఉద్యోగం, ఉపాధి పొందేందుకు ఈ కోర్సులు దోహదపడతాయి. విదేశాల్లోనూ ఈ కోర్సులద్వారా ఉద్యోగావకాశాలు ఎక్కువగానే లభిస్తాయి. వీటిని సద్వినియోగం చేసుకోవాలి.

- గోపాల్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా కన్వీనర్

ఈ సంవత్సరం నుంచే కొత్త కోర్సులు

ఉమ్మడి జిల్లాలోని ఏడు ఏటీసీలలో ఈ సంవత్సరం నుంచే కొత్తకోర్సులు ప్రారంభించనున్నట్లు ఆయా ఏటీసీల ప్రిన్సిపాళ్లు పేర్కొంటున్నారు. ఇంకా పూర్తిస్థాయి విధి, విధానాలు రాలేదని, ప్రాథమిక కసరత్తు, ఇన్‌స్ట్రక్టర్ల నియామకాలు జరిగాయని, వర్క్‌షాపులు, క్లాసుల నిర్వహణపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. కోర్సులకు కేటాయించిన సీట్ల మేరకు విద్యార్థులకు అవకాశం కల్పిస్తామని, ఐటీఐలలో సీట్ల కేటాయింపుల మాదిరిగానే ఏటీసీల్లోనూ నిబంధనలు పాటిస్తామని తెలిపారు.

జిల్లాలో ఏటీసీలలో అందుబాటులో ఉన్న కోర్సులు	కాల వ్యవధి	సీట్ల సంఖ్య
1. అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మెషినింగ్ టెక్నీషియన్	రెండేళ్లు	24
2. ఆర్టీఫిషియన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్	ఏడాది	10
3. బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్ (మెకానికల్)	రెండేళ్లు	24
4. రోబోటిక్స్ డిజిటల్ మాన్యుఫాక్చరింగ్ టెక్నీషియన్	ఏడాది	20
5. మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికిల్	రెండేళ్లు	24
6. మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్	ఏడాది	20

ఉమ్మడి జిల్లాలో ఏటీసీలుగా మారనున్న ప్రభుత్వ ఐటీఐలివే..

1. ప్రభుత్వ బాలుర పారిశ్రామిక శిక్షణ సంస్థ	నల్లగొండ
2. ప్రభుత్వ బాలికల పారిశ్రామిక శిక్షణ సంస్థ	నల్లగొండ
3. ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ	అనుముల
4. ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ	డిండి
5. ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ	భువనగిరి
6. ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ	ఆలేరు
7. ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ	హుజూర్‌నగర్

ప్రతీ ఏటీసీలో ఆరు దీర్ఘకాలిక కోర్సులు

ఈ ఏటీసీలలో ఆరు దీర్ఘకాలిక కోర్సులను ప్రవేశపెట్టనున్నారు. ఇందులో మూడు కోర్సులు ఏడాది కాలవ్యవధి ఉంటే, మరో మూడు కోర్సులు రెండేళ్ల కాలవ్యవధిలో పూర్తవుతాయి. ప్రతీ ఏటీసీలో ఈ ఆరు కోర్సులను నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఆరు కోర్సుల్లో కలిసి 122మంది విద్యార్థులకు ఒక్కో ఏడాది శిక్షణ అందుతుంది. అదేవిధంగా ఒక్కో కోర్సును బోధించేందుకు ఇద్దరు ఇన్‌స్ట్రక్టర్ల చొప్పున ఉమ్మడి జిల్లాకు 84మంది ఇన్‌స్ట్రక్టర్లను టీటీఎస్ సంస్థ ఇప్పటికే నియమించింది. అదేవిధంగా ఇప్పటికే ప్రభుత్వ ఐటీఐల్లో ఉన్న ఇతర ఇన్‌స్ట్రక్టర్లను కూడా ఈ కోర్సులను బోధించేందుకు వీలుగా తగు శిక్షణను కూడా టీటీఎల్ సంస్థ ఇప్పటికే అందించినట్లు తెలుస్తోంది. ఈ ఇన్‌స్ట్రక్టర్లతోపాటు ప్రతీ ఏటీసీలో మరో నలుగురు సిబ్బందిని కూడా నియమిస్తున్నట్లు తెలిపారు. ఏటీసీల నిర్వహణ మొత్తం టీటీఎల్ సంస్థనే పర్యవేక్షిస్తుందని, కోర్సులు మొదలయ్యాక ఇంకా మార్పులు, చేర్పులుంటాయని పేర్కొంటున్నారు.



విద్యాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

కలెక్టర్ హనుమంతు కే.జెండగే



సంస్థాన్ నారాయణపురంలోని బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినితో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు జెండగే

సంస్థాన్ నారాయణపురం, జూన్ 19: విద్యాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని కలెక్టర్ హనుమంతు కే. జెండగే అన్నారు. బుధవారం సంస్థాన్‌నారాయణపురం మండలంలో పర్యటించారు. మండలంలోని గుడిమల్కాపురం ప్రాథమికోన్నత పాఠశాల, సంస్థాన్‌నారాయణపురంలోని బాలికల ఉన్నత పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలపై కలెక్టర్ ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను ప్రధానోపాధ్యాయుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాల పంపిణీ జరిగిందా? లేదా? విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం ఎలా ఉందో విద్యార్థులను అడిగారు. తరగతి గదులను పరిశీలించి విద్యాభ్యాసానికి సంబంధించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలల్లో ఏమైనా సమస్యలు ఉంటే వాటిని తక్షణమే పరిష్కరించాలని, అందుకు అవసరమైన బడ్జెట్‌ను విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అనంతరం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ధరణి ఫైల్స్‌కు సంబంధించిన విషయాలపై అధికారులను ఆరా తీశారు. రెవెన్యూ కార్యాలయంలో ఎలాంటి సమస్యలు పెండింగ్లో ఉన్నాయి. వాటి పరిష్కారానికి సంబంధించి ఎలాంటి చర్యలు చేపట్టాలనే దానిపై అధికారులకు సలహాలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూసమస్యలను త్వరగా పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ధరణి సమస్యల పరిష్కారంకోసం ఇప్పటికే తహసీల్దార్లకు లాగిన్ ఇచ్చామన్నారు. తహసీల్దార్, ఆర్డీవో అధికారుల స్థాయిలో పలు సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. మరికొన్ని సమస్యలకు కలెక్టర్, సీసీఎల్ఏ స్థాయిలో పరిష్కారమవుతుందన్నారు. ధరణి పోర్టల్ ద్వారా లాగిన్‌లోకి వచ్చిన సమస్యలను తహసీల్దార్లు వారం, పది రోజుల్లో పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుత్తా ఉమాదేవి, తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీవో ప్రమోద్ కుమార్, ఎంఈవో నాగవర్ధన్ రెడ్డి, ఏపీవో యాదయ్య, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'ధరణి' సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి

చౌటుప్పల్ టౌన్: ధరణిలో రైతుల సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. చౌటుప్పల్ ఆర్డీవో కార్యాలయంలో బుధవారం డివిజన్‌లోని ఐదు మండలాలకు సంబంధించిన 450 ధరణి సమస్యలపై కలెక్టర్ సమీక్ష చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధరణిలో నెలకొన్న రైతుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని, వీలైనంత తొందరగా సమస్యలను పరిష్కరించాలన్నారు. సమీక్షలో ఆర్డీవో శేఖర్‌రెడ్డి, డీఏవో శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ సురేందర్ శర్మ పాల్గొన్నారు.



ప్రైవేట్ పాఠశాలలపై కొరడా

భువనగిరిలో ఓ పాఠశాల బుక్‌స్టోర్‌ను సీజ్ చేస్తున్న విద్యాశాఖ అధికారులు

- అధిక ధరలకు పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్న పుస్తక విక్రయ కేంద్రాల సీజ్
- జిల్లాలో ఇప్పటికే నాలుగైదు పాఠశాలలపై చర్యలు
- విస్తృతంగా తనిఖీలు చేపడుతున్న విద్యాశాఖ అధికారులు

యాదాద్రి, జూన్19(ఆంధ్రజ్యోతి): నిబంధనలు అతిక్రమించే ప్రైవేట్ పాఠశాలలపై విద్యాశాఖ కొరడా ఝుళిపిస్తోంది. లాభాలకోసం అధిక ధరలకు పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఇప్పటికే ఆయా పాఠశాలల్లోని పుస్తక విక్రయ కేంద్రాలను సీజ్ చేసింది. అధిక ధరలకు విక్రయిస్తే పాఠశాలల గుర్తింపును సైతం రద్దు చేస్తామని హెచ్చరిస్తోంది. జిల్లాలో మొత్తం 712 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటిలో ప్రాథమిక పాఠశాలలు 481వరకు ఉండగా, ప్రాథమికోన్నత పాఠశాలలు 68, ఉన్నత పాఠశాలలు 163 ఉన్నాయి. జిల్లాలో మొత్తం 150 వరకు ప్రైవేట్ పాఠశాలలున్నాయి. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పాఠ్యపుస్తకాలు విక్రయిస్తే పుస్తక విక్రయ కేంద్రాల వద్ద ధరల పట్టికను ఏర్పాటుచేయాలి. పాఠ్యపుస్తకాల విక్రయం ధర తల్లిదండ్రులకు సౌకర్యవంతంగా ఉండాలి. లాభం, నష్టం లేకుండా విక్రయించాలి. అయితే పలు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అధిక ధరలకు పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్నారని అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో విద్యాశాఖ అధికారులు జిల్లావ్యాప్తంగా పాఠశాలల్లో విస్తృత తనిఖీలు చేపడుతున్నా రు. అధిక ధరలకు విక్రయిస్తున్న బుక్‌స్టోర్‌లను సీజ్ చేస్తున్నారు. ఈనెల 18, 19 తేదీల్లో జిల్లాకేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్, మదర్‌థెరిస్సా, మాంటిస్సోరి, ప్రెసిడెన్సీ, గౌతం మోడల్ పాఠశాలల్లోని బుక్‌స్టోర్లను విద్యాశాఖ అధికారులు సీజ్‌చేశారు. జిల్లావ్యాప్తంగా తనిఖీలు చేసి, అధిక ధరలకు విక్రయించకుండా చర్యలు తీసుకుంటున్నారు.

ఆకాశాన్నంటుతున్న పుస్తకాల ధరలు

ప్రభుత్వం ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ప్రైవేట్ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలను విక్రయించేందుకు అనుమతించింది. అయితే ఈ పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పలు పాఠశాలల యాజమాన్యాలు రెండు దఫాలుగా విక్రయిస్తున్నారు. మొదటి ఆరునెలలకు ఒక్కో విద్యార్థికి తరగతిని బట్టి రూ.1500 నుంచి రూ.8వేల వరకు ఖర్చవుతోంది. దీం తో తల్లిదండ్రులపై ఆర్థికంగా భారమైనప్పటికీ, తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ పాఠశాలల్లోనే తమ పిల్లలను చదివిస్తున్నారు. అయితే 6నుంచి 10వ తరగతి వరకు అన్ని పాఠశాలలు కూడా విధిగా ప్రభుత్వం ముద్రించిన పాఠ్య పుస్తకాల నే విక్రయించాలి. అయితే ప్రభు త్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఉచితంగా ఇవ్వ గా, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు డబ్బులకు విక్రయిస్తోంది. అయితే ఇదే అదునుగా పలు ప్రైవే ట్ పాఠశాలల యాజమన్యాలు అధిక ధరలకు పాఠ్యపుస్తకాలు విక్రయిస్తుండటంతో విద్యాశాఖ చర్యలకు ఉపక్రమించింది.

ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాల పంపిణీ

జిల్లాలోని అన్ని యాజమన్యాల పరిధిలోని పాఠశాలల్లో మొత్తం 47,921మంది విద్యార్థులు ఉన్నారు. జిల్లాలో మొత్తం 3,13,442 ప్రభుత్వ ఉచిత పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు కావాల్సి ఉండగా, 2,18,955 (71శాతం) పుస్తకాలు జిల్లాకు చేరాయి. అదేవిధంగా నోట్ పుస్తకాలు 2,90,0 49 కావాల్సి ఉండగా, 31, 700 నోట్‌బుక్స్ జిల్లాకు చేరా యి. పాఠ్యపుస్తకాలను, నోట్‌బుక్స్‌లను ఆయా పాఠశాలలకు జూన్ 12వ తేదీలోగా చేర్చారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. నోట్‌బుక్స్ ప్రస్తుతం ఉన్న స్టాక్‌ను విద్యార్థులకు అందించి దశలవారీగా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

అధిక ధరలకు విక్రయిస్తున్న పుస్తక కేంద్రాల సీజ్

భువనగిరి రూరల్, వలిగొండ: జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో విద్యాశాఖ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. జిల్లాకేంద్రంలోని మాంటిస్సోరి, మదర్ థెరిస్సా, ప్రెసిడెన్సి, కృష్ణవేణి స్కూళ్లలో అక్రమంగా అధిక ధరలకు పుస్తకాలు విక్రయిస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు ఎంఈవో నాగవర్ధన్‌రెడ్డి బుధవారం ఆయా పాఠశాలల్లోని పుస్తకాల విక్రయ కేంద్రాలను సీజ్‌చేశారు. ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మంగ ప్రవీణ్ కలెక్టర్, డీఈవోలకు వేర్వేరుగా ఫిర్యాదు చేయగా, ఈ మేరకు విద్యాశాఖ అధికారులు ఆయా పాఠశాలల్లో పుస్తకాలు విక్రయిస్తున్న గదులను సీజ్ చేశారు. అదేవిధంగా వలిగొండ మండల కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాలకు 2024-25 సంవత్సరానికి ప్రభుత్వం నుంచి అనుమతులు రాలేదని, పాఠశాల కార్యాలయాన్ని సీజ్ చేసినట్లు ఎంఈవో శ్రీధర్ తెలిపారు.

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు



పాఠ్యపుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తే ప్రైవేట్ యాజమాన్యాలపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. జిల్లాలోని పలు పాఠశాలల యాజమాన్యాలు బుక్‌స్టోర్ ముందు ఎలాంటి ధరల పట్టిక లేకుండా అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. జిల్లాకేంద్రంలోని నాలుగైదు పాఠశాలలకు చెందిన బుక్‌స్టోర్‌లను సీజ్‌చేశాం. తల్లిదండ్రులకు ఇబ్బంది కలుగకుండా విక్రయించాలి. లాభాల కోసం విక్రయించ వద్దని ఆదేశాలు జారీచేశాం. జిల్లావ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు చేపట్టి, అధిక ధరలకు విక్రయించకుండా చర్యలు తీసుకుంటున్నాం.

- కే.నారాయణరెడ్డి, డీఈవో

విస్తృతంగా తనిఖీలు చేపట్టాలి



జిల్లాలోని పలు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యాశాఖ నిబంధనలు ఉల్లంఘించి పాఠ్యపుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తున్నాయి. విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తేనే తనిఖీలు చేస్తున్నారు. అలా కాకుండా జిల్లావ్యాప్తంగా అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో తనిఖీలు చేపట్టి, అధిక ధరలకు విక్రయిస్తున్న యాజమాన్యాలపై కఠినంగా చర్యలు తీసుకోవాలి.

- ఇటికెల దేవేందర్, ఎంఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకుడు

చరిత్రను తిరగరాసేది కమ్యూనిస్టులే

● **ప్రొఫెసర్ కాశీం**



గుట్టలో శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న కాశీం

యాదగిరిగుట్ట రూరల్, జూన్ 19: చరిత్రను తిరగరాసేది యువ కమ్యూనిస్టులేనని ప్రొఫెసర్ కాశీం అన్నారు. బుధవారం యాదగిరిగుట్టలో రెండు రోజులుగా దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్రస్థాయి శిక్షణా శిబిరంలో పాల్గొని మాట్లాడారు. కులం, మతం, వర్ణం, వర్గ పోరాటాలు ఇంకా కొనసాగడం సరికాదన్నారు. తరతరాలుగా దళితవర్గం అణిచివేతకు గురవుతోందన్నారు. అసమాతలు, అవమానాలకు గురైన వారందరినీ చేరదీసి సమానత్వం కోసం పోరాడి కమ్యూనిస్టు పార్టీ వారికి అండగా ఎర్రజెండా నిలిచిందన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారపాక అనిల్‌కుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, ఏశాల అశోక్, చెక్క వెంకటేశం, బబ్బూరి శ్రీధర్, లక్ష్మీపతి, లావణ్య, రేసు రత్నం పాల్గొన్నారు.

చేనేత సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

● **చేనేత, జౌళి మంత్రిత్వ శాఖ అసిస్టెంట్ సెక్రటరీ ఆకునూరి నరేష్**

భూదాన్‌పోచంపల్లి: చేనేత రంగంపై ఆధారపడిన చేనేత కార్మికుల, వ్యాపారుల సమస్యలనే కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని భారత ప్రభుత్వ చేనేత, జౌళి మంత్రిత్వ శాఖ అసిస్టెంట్ సెక్రటరీ ఆకునూరి నరేష్ అన్నారు. బుధవారం ఆయన భూదాన్‌పోచంపల్లిలో పర్యటించారు. గతంలో మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ అడిషనల్ సెక్రటరీ అండ్ ఫైనాన్స్ అడ్వయిజర్ హర్షిత్ గోపాల్, పలువురు చేనేత వ్యాపారులు అందించిన వినతిపత్రాన్ని పరిగణనలోకి తీసుకుని చేనేత రంగాన్ని పరిశీలించేందుకు వచ్చినట్లు తెలిపారు. పట్టణంలోని శ్రీరంగం సిల్క్ వీవింగ్ యూనిట్‌ను తనిఖీ చేశారు. చేనేతకు సంబంధించిన ప్రింటింగ్ చీరల నివారణ, వ్యాపారస్థులకు ముద్ర రుణాలు, నూతన డిజైన్ల సహకారం, చేనేత సమస్యలను పరిష్కరించాలని ఆయనకు అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్ విన్నవించారు. కార్యక్రమంలో అరుణ్‌కుమార్, విద్యాసాగర్, ప్రసాద్, ఆంజనేయులు, భారత లవకుమార్ పాల్గొన్నారు.

అవినీతి, అక్రమాలపై విచారణ జరపాలి

మంత్రి నాగేశ్వర్ రావుకు అఖిలపక్ష నేతల వినతి



మంత్రి నాగేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్షం నాయకులు

చౌటుప్పల్ టౌన్, జూన్ 19: చౌటుప్పల్ పట్టణంలోని చేనేత సహకార సంఘం పాలకవర్గం పాల్పడుతున్న అవినీతి, అక్రమాలపై విచారణ జరపాలని అఖిలపక్షం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. చౌటుప్పల్ పట్టణానికి చెందిన అఖిలపక్ష నాయకులు గోశిక స్వామి, గోశిక రవి, కూరపాటి రమేష్, గుర్రం నర్సింహ, గోశిక భిక్షపతి, వనం ధనుంజయ్య, గోశిక నర్సింహ ఆధ్వర్యంలో చేనేత కార్మికులు హైదరాబాద్‌లో మంత్రి నాగేశ్వర్‌రావును కలిసి సంఘం పాలకవర్గం సాగిస్తున్న అవినీతి, అక్రమాలను వివరించారు. సంఘం పర్సన్ ఇన్‌చార్జి కందకట్ల భిక్షపతి(బీఆర్ఎస్) ఆధ్వర్యంలోని పాలకవర్గం గత 11ఏళ్లుగా కొనసాగుతూ అనేక అక్రమాలకు పాల్పడిందని, దీనిపై రెండేళ్ల క్రితమే రాష్ట్ర అధికారులకు ఫిర్యాదు చేశామని అఖిలపక్ష నేతలు తెలిపారు. పాలకవర్గం సాగిస్తున్న అవినీతి వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ జరిపి రూ.60లక్షల అవినీతి జరిగినట్లు నిర్ధారించి, విచారణకు ఆదేశించారని చెప్పారు. ఈ విచారణ జరుగుతున్న సమయంలోనే 2022లో వచ్చిన మునుగోడు ఉపఎన్నిక సందర్భంగా నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం రాజకీయ లబ్ధికోసం విచారణను నిలిపివేయించిందన్నారు. పర్సన్ ఇన్‌చార్జి భిక్షపతి సంఘం నిధులను సొంతానికి వాడుకొని దుర్వినియోగానికి పాల్పడ్డారని, సంఘం పేరు చెప్పి లక్షల రూపాయలను వడ్డీలకు తెచ్చి స్వప్రయోజనాలకు వాడుకున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ అండదండలతో భిక్షపతి సాగించిన అక్రమాలకు అడ్డూ, అదుపు లేకుండా పోయిందని, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ సంఘాన్ని దివాళా తీయించారన్నారు. వర్క్ షెడ్ వద్ద రోడ్డుకోసం వదిలి పెట్టిన స్థలాన్ని సైతం విక్రయించడం దుర్మార్గమన్నారు. సంఘంలో జరుగుతున్న అవినీతిపై ప్రశ్నించిన చేనేత కార్మికులపై భిక్షపతి అక్రమ కేసులు బనాయించడంతోపాటు పరువు నష్టం దావా కింద లీగల్ నోటీసులను పంపించారని మంత్రికి వారు తెలిపారు. కాగా, చేనేత కార్మికులు చెప్పిన విషయాలపై మంత్రి ఆరా తీశారు. చేనేత సంఘాలతోపాటు కార్మికులకు ఎలాంటి నష్టాలు, ఇబ్బందులు జరిగినా ఊరుకునేది లేదని, చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

మౌలిక వసతుల కల్పనపై దృష్టి

స్థాయీ సంఘం సమావేశంలో జడ్పీవైస్‌చైర్మన్ ధనావత్ బీకూనాయక్



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ వైస్‌చైర్మన్ బీకూ నాయక్, చిత్రంలో సీఈవో శోభారాణి, డిప్యూటీ సీఈవో విష్ణువర్ధన్‌రెడ్డి

భువనగిరి రూరల్, జూన్ 19: క్షేత్ర స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండి మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించి మెరుగైన సేవలందించాలని జడ్పీ వైస్‌చైర్మన్ ధనావత్ బీకూనాయక్ అధికారులకు సూచించారు. బుధవారం జడ్పీ కార్యాలయంలో 3వ (వ్యవసాయ) స్థాయీ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. వానాకాలం పంటల సాగుకోసం రైతులకు ఎరువులు, విత్తనాలు, సకాలంలో అందుబాటులో ఉండే విధంగా చూడాలన్నారు. బహిరంగ మార్కెట్‌లో కల్తీ విత్తనాల విక్రయిస్తున్నారన్న సమాచారం ఉందని, అలాంటి వారిని గుర్తించి ఉక్కుపాదం మోపాలన్నారు. ఫర్టిలైజర్, విత్తనాల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు చేపట్టి రైతులకు ఎమ్మార్పీ రేట్లపై విత్తనాలు అందించే విధంగా దృష్టి కేంద్రీకరించాలని జిల్లా వ్యవసాయ అధికారి కే.అనురాధకు సూచించారు. ఆయిల్‌పామ్ సాగు, కూరగాయలు, పండ్ల తోటలకు సబ్సిడీ పరికరాలు, చేప పిల్లల పంపిణీ, వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులకు వసతి, రైతు బజారులో కూరగాయల ధరలు అందుబాటులో ఉన్నాయా ? లేదా? అని సంబంధిత శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా 5వ (మహిళ, శిశు సంక్షేమ)స్థాయీ సంఘం సమావేశం బీబీనగర్ జడ్పీటీసీ గోలి ప్రణిత పింగల్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ, ఆరోగ్య లక్ష్మీ పథకం, పోషణ్ అభియాన్, ప్రీస్కూల్, సఖీ కేంద్రం పనితీరుపై ప్రాజెక్టులవారీగా సమీక్షించారు. అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రతీఒక్కరు కృషి చేయాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవోఎస్.శోభారాణి, డిప్యూటీ సీఈవో డి.విష్ణువర్ధన్‌రెడ్డి, జడ్పీటీసీ సుబ్బారు బీరుమల్లయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు కేవీ కృష్ణవేణి, కె.అనురాధ, డాక్టర్ అయిలయ్య, శ్రీనివాస్‌రెడ్డి, గోపీకృష్ణ, అన్నపూర్ణ, రాఘవరెడ్డి, ప్రవీణ్‌కుమార్, రాజారాం, స్వరాజ్యం, పోతంశెట్టి నిఖిల్, స్వాతిశ్రీ పాల్గొన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

భువనగిరి అర్బన్, జూన్ 19: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్య కైంకర్యాలు పాంచరాత్రాగమశాస్త్ర రీతిలో వైభవంగా నిర్వహించారు. ప్రభాతవేళ సుప్రభాతంతో స్వామిఅమ్మవార్లను మేల్కొలిపిన అర్చకస్వాములు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ అభిషేకించి తులసీదళాలతో సహస్రనామార్చన చేశారు. ప్రధానాలయ అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవార్లను ముగ్ధమనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్యతిరుకల్యాణోత్సవ పర్వాలు ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించారు. కొండపైన శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.25,03,371 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని నటి అనసూయ భరద్వాజ్ దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు అర్చకులు వేదాశీర్వచనం చేయగా, స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని ఆలయ అధికారులు అందజేశారు.


ప్రధానాలయంలో నిత్య పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కుటుంబ కలహాలతో ఆత్మహత్య


కృష్ణ (ఫైల్)

దామరచర్ల, జూన్ 19: రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మండలకేంద్రంలో బుధవారం జరిగింది. రైల్వే ఎస్‌ఐ పవన్‌కుమార్‌రెడ్డి... తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండల కేంద్రానికి చెందిన మద్దూరి కృష్ణ(52) కుటుంబ కలహాలతో ఇంట్లో నుంచి బయటకు వచ్చి తిరుపతి నుంచి మహారాష్ట్ర వైపు వెళ్తున్న పూర్ణ ఎక్స్‌ప్రెస్ కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. లోకో పైలట్ ఇచ్చిన సమాచారంతో రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు రైల్వేఎస్‌ఐ తెలిపారు. కేసును రైల్వే హెడ్ కానిస్టేబుల్ రజిత దర్యాప్తు చేపట్టారు. కృష్ణకు భార్య లక్ష్మమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

నాపరాయి తరలిస్తున్న లారీ పట్టివేత

ప్రభుత్వ అనుమతులు లేకుండా నాపరాయిని తరలిస్తున్న లారీని నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లిలో పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన సంఘటన ఉల్సాయిపాలెం గ్రామ శివారులోని కాల్వకట్ట వద్ద మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిట్యాల గ్రామం నుంచి నాపరాయిని లారీలో లోడ్ చేసుకొని ఏపీలోని పల్నాడు జిల్లా మాచర్లకు అక్రమంగా తరలిస్తుండగా పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు ఉల్సాయిపాలెం గ్రామ శివారులోని కాల్వకట్ట వద్ద లారీని పట్టుకున్నారు. అందులో ఉన్న ముగ్గురు వ్యక్తులు పరారయ్యారన్నారు. లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. లారీ డ్రైవర్ బత్తుల అమరలింగంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న లారీ

ఎంపీడీవో కార్యాలయంలోనే గ్రీవెన్స్‌డే

త్రిపురారం: ప్రజా సమస్యల పరిష్కారానికి కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 24 నుంచి స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోనే గ్రీవెన్స్‌డే కార్యక్రమం నిర్వహించనున్నట్లు నల్లగొండ జడ్పీ డిప్యూటీ సీఈవో బీ. శ్రీనివాస్‌రావు తెలిపారు. నల్లగొండ జిల్లా త్రిపురారం మండలకేంద్రంలో ఇన్‌చార్జి ఎంపీడీవో విజయకుమారి, సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్‌తో బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీవో కోడిరెక్క. రాజేందర్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



సమస్యల పరిష్కారానికి పోరాటాలు

● తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ 1104 యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు


మిర్యాలగూడలో జరిగిన సమావేశంలో 1104 యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

మిర్యాలగూడ, జూన్ 19: విద్యుత్ ఉద్యోగుల, కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు నిర్వహిస్తామని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ 1104యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేమూరి వెంకటేశ్వర్లు తెలిపారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో బుధవారం జరిగిన డివిజన్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. అధికారంలో ఏ ప్రభుత్వం ఉన్నా కార్మికుల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తామన్నారు. పీఆర్‌సీ, ఈపీఎఫ్, జీపీఎఫ్ సాధన దిశగా ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. మార్చి 10న యూనియన్ రాష్ట్ర నాయకత్వం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొం టున్న సమస్యలను వివరించి పరిష్కారించాలని కోరినట్లు తెలిపారు. 50డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీఎండీకి ఇచ్చినట్లు తెలిపారు. త్వరలోనే వాటిని పరిష్కరిస్తామని హమీ ఇచ్చారన్నారు. అనంతరం యూనియన్ డివిజన్ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎండీ. షఫీఖాన్, కార్యనిర్వహక అధ్యక్షుడిగా ఎస్‌కె. అహ్మద్, డివిజన్ కార్యదర్శి గోలి నరేందర్‌రెడ్డి, అదనపు కార్యదర్శిగా మోతీలాల్ నాయక్ ఎన్నికయ్యారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు టి. జైపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జి. సాయిబాబా, డిస్కం అధ్యక్షుడు వేణు, కార్యనిర్వహక అధ్యక్షుడు ఎన్. వెంకన్న, రాష్ట్ర సలహాదారు ఎన్. జనార్థన్‌రెడ్డి, జి. శ్రీనివాస్, వెంకటయ్య, డివిజన్ నాయకులు సి.సాలమన్, కర్ర రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదు

నల్లగొండ టౌన్: విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు వెనుకాడేది లేదని 1104 యూనియన్ ప్రధాన కార్యదర్శి సాయిబాబు అన్నారు. స్థానిక కార్యాలయంలో బుధవారం నిర్వహించిన యూనియన్ ప్రాంతీయ సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. విద్యుత్ ఉద్యోగులు నిత్యం వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నారన్నారు. న్యాయపరమైన ఇబ్బందుల పేరుతో విద్యుత్ రంగంలో ఉద్యోగులు మూడు సంవత్సరాలుగా పదోన్నతులకు నోచుకోవడం లేదన్నారు. ఉద్యోగులకు పదోన్నతుల ప్రక్రియ ప్రారంభించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏ సంఘం కృషి ఫలితంగా విడుదల చేయనున్నారని తెలిపారు. ఉద్యోగులకు బదిలీలు ఇవ్వాలని, విద్యుత్ ఉద్యోగులకు, ఆర్టిజన్లకు కోటి రూపాయల బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్టిజన్ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలన్నారు. సీనియర్ ఫోర్‌మెన్ పోస్టులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న 52సమస్యలపై ఇప్పటికే యాజమాన్యానికి నోటీసు అందజేసి పీఎస్‌సీ సమావేశం అడిగినట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.వెంకటేశ్వర్లు, జిల్లా రీజినల్ అధ్యక్షుడు నిమ్మచెట్ల వెంకటయ్య, ఎస్‌పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు ఏ. వేణు, వర్కింగ్ అధ్యక్షుడు ఎన్. వెంకన్న, యూనియన్ రాష్ట్ర సలహాదారుడు ఆర్.జనార్థన్‌రెడ్డి, జిల్లా అద్యక్షుడు టి. జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్, పి. రాంబాబు, డి కోటి, సిహెచ్ యాదగిరి, కె. జగదీష్, శీనయ్య, పీవీ. నాయక్, ముత్తయ్య ఉన్నారు.



'నీట్' పరీక్ష రద్దు చేయాలి


మిర్యాలగూడలో సంతకాలు సేకరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మిర్యాలగూడ టౌన్, జూన్ 19: నీట్ పరీక్షను రద్దు చేసి, వేలాది మంది విద్యార్థులకు న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రూపావత్ హరిప్రసాద్, జిల్లా అధ్యక్షుడు ఎంఏ ఆరీఫ్ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో బుధవారం విద్యార్థుల నుంచి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యవిద్యలో ప్రవేశాలకు నిర్వహించే ప్రశ్నాపత్రం లీక్ కావడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమేనన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకొని, సమగ్ర విచారణ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు చందాల ప్రశాంత్‌కుమార్, సంజీవ్, సతీష్, రాము, పవన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులు నియంత్రించాలి

హాలియా, జూన్, 19: ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించాలని, ప్రభుత్వ నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా హాలియాలోని సుందరయ్య భవన్‌లో బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నాయన్నారు. పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్న వారిపై, అనుమతి లేని పాఠశాలలపై, సీబీఎస్ సిలబస్ పేరుతో తల్లితండ్రులను మోసం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నల్లబెల్లి జగదీష్, కోరే రమేష్, చందు, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం.. పోలీసులకు ఫిర్యాదు

మిర్యాలగూడ అర్బన్, జూన్ 19: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని రాంనగర్‌కు చెందిన కొండేటి సురేష్, రూత్ దంపతుల కూతురు(16) కన్పించడం లేదని బుధవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పుట్టుకతో చెవుడు సమస్యతో బాధపడుతున్న బాలిక అవంతీపురంలోని బధిరుల పాఠశాలలో విద్యనభ్యసిస్తోంది. ఈ నెల 18వ తేదీన పట్టణంలోని రాంనగర్ సరస్వతీ స్కూల్ వెనుక భాగంలో ఉన్న తమ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని పేర్కొన్నారు. బాలిక ఆచూకీ తెలిసిన వారు సెల్: 7075050756, 8341853108 నెంబర్లకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

తొమ్మిది క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మునుగోడు, జూన్ 19: నల్లగొండ జిల్లా మునుగోడు శివారు మీదుగా రెండు గూడ్స్ ఆటోల్లో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు బుధవారం దాడి చేసి పట్టుకున్నారు. ఎస్ఐ సీహెచ్. వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన శ్రీశైలం, రూప్‌సింగ్ వేర్వేరుగా ఆటోల్లో వివిధ సంచుల్లో నింపుకొని తరలిస్తున్న తొమ్మిది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. బియ్యాన్ని సీజ్ చేసి ఇద్దరిపై కేసునమోదు చేసినట్లు తెలిపారు.

సారా తయారీ కేంద్రాలపై దాడులు


బెల్లం పానకం ధ్వంసం చేస్తున్న పోలీసులు

పెద్దఅడిశర్లపల్లి, జూన్19: నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలంలోని పడమటితండాలోని సారా తయారీ కేంద్రాలపై ఎక్సైజ్ పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. నిల్వ ఉంచిన 600 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. దేవరకొండ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మల్లేషంతో కలిసి ధ్వంసం చేశారు. సారా బట్టీలు నిర్వహించినా, నల్లబెల్లం, పటిక నిల్వ ఉంచినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. మొదటిసారి పట్టుబడితే బైండోవర్, రెండోసారి పట్టుబడితే జైలుకు పంపుతామన్నారు. దాడుల్లో వేణుగోపాల్‌రెడ్డి, కృష్ణ, సైదులు, నాగరాజు, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గదిలోనే శునకం.. తాళం వేసిన కళాశాల సిబ్బంది

దేవరకొండ, జూన్19: తరగతిలోకి వెళ్లిన శునకాన్ని గమనించకుండా సిబ్బంది తాళం వేసి వెళ్లిపోయారు. బయటికి వెళ్లేందుకు దారి లేకపోవడంతో కిటికీల వద్దకు వచ్చి మొరుగుతూ గంట సేపు యాతన పడింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాలలో బుధవారం జరిగింది. సాయంత్రం కళాశాల ముగిసిన తర్వాత సిబ్బంది తరగతి గదులకు తాళాలు వేసే క్రమంలో కళాశాల గదిలోకి ఓ శునకం చేరింది. దానిని గమనించని సిబ్బంది కళాశాల గదులకు తాళాలు వేసి వెళ్లిపోయారు. కొంత సమయం తర్వాత బయటికి వెళ్లేందుకు దారి లేకపోవడంతో శునకం కిటికీల వద్దకు వచ్చి మొరిగింది. కళాశాల ఆవరణలో సాయంత్రం వాకింగ్ చేస్తున్న డివిజన్ పంచాయతీ అధికారి రాంమోహన్‌కు శునకం అరుపులు వినిపించాయి. ఆయన వెంటనే అక్కడికి వెళ్లి తాగునీరు, ఆహారం అందించారు. స్థానిక ఎంఈవోకు, కళాశాల ప్రిన్సిపాల్‌కు సమాచారం అందించారు. సిబ్బంది వెంటనే వచ్చి కళాశాల గది తెరవడంతో శునకం బయటకు వచ్చి పారిపోయింది.

సమాచారం

నిత్యపూజా కైంకర్యాలు


ఉదయం 3.30 గంటలకు ఆలయాన్ని తెరుస్తారు
సుప్రభాతసేవ: ఉదయం 3.30నుంచి4వరకు
ఆరాధన: 4-4.30 వరకు, **బాలభోగం:** 4.30-5.15వరకు
నిజాభిషేకం: 5.15 నుంచి 6.15 గంటల వరకు
సహస్రనామార్చనలు: 6.15నుంచి 7గంటల వరకు
రాజభోగం: 11.45నుంచి 12.30వరకు, మధ్యాహ్నం 3-4 వరకు ఆలయం మూసివేస్తారు.
తిరువారాధన: సాయంత్రం 7నుంచి7.45గంటల వరకు
సహస్రనామార్చన: రాత్రి 7.30నుంచి 8.15గంటల వరకు
ఆరగింపు: రాత్రి 9 గంటల నుంచి
శయనోత్సవ దర్శనం: 9.30- 9.45 ద్వార బంధనం
ఉచిత దర్శనం: ఉదయం 5 నుంచి 8 గంటల వరకు తిరిగి సాయంత్రం 5-7 రాత్రి 8.15-9 గంటల వరకు
వీఐపీ వేళలు: ఉదయం 9-10, సాయంత్రం 4-5వరకు..
భువనగిరి అర్బన్

మూడు నెలల ముందుగానే
వర్చువల్ క్యూ బుకింగ్


● శబరిమల దర్శించే భక్తులకు ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు శుభవార్త

నార్కట్‌పల్లి, జూన్ 19: మండల పూజ, మకర విళక్కు సమయాల్లో శబరిమలను దర్శించే భక్తులకు ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు శుభవార్త చెప్పింది. శబరిమలకు వెళ్లే భక్తులకు కనీస వసతులు, భద్రత కోరుతూ ప్రచారసమితి తరఫున గతేడాది కేరళ సీఎం పినరై విజయన్‌కు తాము చేసిన వినతికి ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు సానుకూలంగా స్పందించిందని అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి జాతీయ అధ్యక్షుడు రాజ్‌దేశ్‌పాండే తెలిపారు. గతంలో స్వామి దర్శనం కోసం ఆన్‌లైన్ బుకింగ్ సదుపాయం కేవలం పదిరోజుల ముందునుంచి మాత్రమే ఉండేదని, ఇప్పుడు మూడు నెలల ముందుగానే వర్చువల్ క్యూ బుకింగ్ చేసుకునే అవకాశాన్ని బోర్డు కల్పించిందని తెలిపారు. అదేవిధంగా భక్తుల ఆరోగ్యభద్రత కోసం ఇన్సూరెన్స్ పాలసీని అందించనున్నట్లు ప్రకటించిందని పేర్కొన్నారు. భక్తులు దర్శనం టికెట్ బుకింగ్ చేసుకునే సమయంలోనే వారి వద్ద నుంచి అదనంగా రూ.10లు వసూలు చేసి బీమా పాలసీని వర్తింపజేస్తారని దేశ్‌పాండే తెలిపారు. చిన్నారుల కోసం ప్రత్యేక బ్యారికేడ్లు ఏర్పాటుచేసి అయ్యప్ప దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. మహిళలు, వృద్ధులు, దివ్యాంగుల కోసం అప్పం, అరవణ ప్రసాదం పంపిణీ కేంద్రాల వద్ద ప్రత్యేక కౌంటర్లను అధికారులు ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా ప్రకటనల ఆవరణలో సెన్సార్ కౌంటింగ్ పరికరాన్ని ఏర్పాటు చేసి భక్తుల సంఖ్యను లెక్కించనున్నారని దేశ్‌పాండే తెలిపారు.

ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్‌గా ఎంఎస్‌రెడ్డి


ఎంఎస్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎస్పీఎఫ్ సిబ్బంది

నాగార్జునసాగర్, జూన్ 19: నాగార్జునసాగర్ ప్రాజెక్టు భద్రత సిబ్బంది ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ఎంఎస్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన అసిస్టెంట్ కమాండెంట్ సామోల్ జాన్ బదిలీపై హైదరాబాద్ ఆర్బీఐకి వెళ్లారు. నూతనంగా వచ్చిన ఎంఎస్‌రెడ్డికి సిబ్బంది స్వాగతం పలికారు. బదిలీపై వెళ్లిన సామోల్ జాన్‌కు వీడ్కోలు పలికారు. ఎస్పీఎఫ్ ఆర్ఐ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వర్‌రావు, పుల్లయ్య, డీడీ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



సరదా అంచున ప్రమాదం


భువనగిరి పెద్ద చెరువు కట్టపై ఇరువైపులా ఆహ్లాదకరమైన చెట్లు, లవ్ భువనగిరి, భారీ ఎత్తున జాతీయ జెండా ఏర్పాటు చేయడంతో సందర్శకుల తాకిడి పెరుగుతోంది. చెరువులోని ఎఫ్‌టీఎల్ మార్కింగ్‌పై ఇరువైపులా రక్షణ గోడ లేదు. అక్కడ సెల్ఫీలు దిగడానికి యువతి, యువకులు ఆసక్తి చూపుతున్నారు. రక్షణ గోడ లేకపోవడంతో చెరువులో పడిపోయే ప్రమాదముంది. ● స్టాఫ్ ఫొటోగ్రాఫర్ యాదాద్రిభువనగిరి

పారిశుధ్య చర్యలేవీ?



వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదు. జాతీయ ఆరోగ్య మిషన్, పంచాయతీ రాజ్ శాఖల మధ్య సమన్వయం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిధులు విడుదల కాకపోవడంతోనే పనులు చేపట్టడంలేదని పలువురు అధికారులు పేర్కొంటుండడం గమనార్హం.

భువనగిరి మండలం అనంతారంలో రహదారి పక్కన నిలిచిన మురుగు నీరు

భువనగిరి రూరల్, జూన్ 19: వానాకాలంలో గ్రామీణ ప్రాంత ప్రజలు ప్రజలు అంటువ్యాధుల బారిన పడకుండా జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) నుంచి పంచాయతీల వారీగా నిధులు మంజూరయ్యేవి. వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీ రాజ్ శాఖలు సంయుక్తంగా గ్రామాల్లో పని చేసేందుకు ప్రణాళికలు చేపట్టేవారు. గత ఏడాది అక్టోబరు నుంచి ఈ నిధులు విడుదల కాకపోవడంతో వానాకాలంలో చేపట్టాల్సిన కార్యక్రమాలు నిర్వహించడం లేదు. ఆ శాఖల మధ్య సమన్వయం లోపించి జిల్లా వ్యాప్తంగా 21 పీహెచ్‌సీల పరిధిలోని 421 గ్రామ పంచాయతీలలో పారిశుధ్యం మెరుగుకు ఎలాంటి చర్యలు చేపట్టలేకపోవడం సరికాదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ నుంచి గ్రామీణ ప్రాంతాలకు ప్రతీ ఏటా మార్చి మొదటి వారం ఆర్థిక సంవత్సరంలో ప్రతీ పంచాయతీ కార్యదర్శి, ఏఎన్‌ఎంల

సీజనల్ వ్యాధులపై ప్రజల్లో ఆందోళన

సంయుక్త ఖాతాలో గ్రామ జనాభాను బట్టి రూ.10 వేల నుంచి రూ.15వేల వరకు ఖాతాలో జమ చేసేవారు. ఈ నిధులు ఈ ఏడాది విడుదల కాకపోవడంతో అంతర్గత రహదారుల సమీపంలో, జనావాసాల మధ్య మురికి నీరు నిలిచిపోవడం అందులో లార్వాల ఉత్పత్తి, దోమలు వ్యాపించడంతో ప్రజలు అంటురోగాల బారిన పడుతున్నారు. వ్యాధులు ప్రబలి గ్రామంలో పరిస్థితులు చేయిదాటితే వైద్యారోగ్య శాఖ సిబ్బంది తాత్కాలికంగా ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేస్తోంది. వర్షాకాలంలో నిధుల కొరత స్పష్టంగా కనిపిస్తోంది. అదీ కాక ఏడాది గ్రామాల్లో ప్రస్తుతం సర్పంచ్‌లు లేరు. ప్రత్యేక అధికారులను కేటాయించారు. అధికారుల ఆధ్వర్యంలోనే గ్రామాల్లో కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

కార్యక్రమాలు ఇవే..

వర్షాకాలంలో గ్రామాల్లో పంచాయతీ అధికారులు పారిశుధ్య కార్యక్రమాలతో పాటు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది గ్రామాల్లోని నిల్వ నీటిలో లార్వా ఉండలు వేయడం, ఇళ్లలో నీటి తొట్లలో నిల్వ ఉన్న నీటిని పారబోయడం, ఇళ్ల పరిసర ప్రాంతాల్లో నిల్వ ఉన్న నీటిని పక్కకు మళ్లించడం తదితర కార్యక్రమాలు జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా మంజూరయ్యే నిధులతో చేపట్టే వారు. ప్రస్తుతం గ్రామాల్లో ఇలాంటి కార్యక్రమాలేవీ సాగడం లేదని పలువురు పేర్కొంటున్నారు. వర్షాకాల కార్యక్రమాలు ఈ నిధుల లేమితో నిలిచిపోయినట్లు సమాచారం. జిల్లాలో 421 గ్రామ పంచాయతీలు, 21 ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం

జాతీయ ఆరోగ్య మిషన్ కింద మంజూరయ్యే నిధుల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతాం. ప్రస్తుతం నిధులు రావడం లేదు. అయినా వైద్య ఆరోగ్య శాఖ పరంగా గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైనప్పుడు చేపట్టాల్సిన కార్యక్రమాలు చేపడుతూనే ఉన్నాం. అంటు వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని ఏఎన్‌ఎంలకు ఆదేశాలిచ్చాం.

- డాక్టర్ వై.పాపారావు, డీఎంహెచ్‌వో, యాదాద్రి భువనగిరి

జడ్పీ సమావేశంలో చర్చ

జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) నిధుల విడుదలపై జడ్పీ స్థాయీ సంఘం సమావేశంలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ డాక్టర్ కుడుదుల నగేష్ డీఎంహెచ్‌వో వై.పాపారావుతో చర్చించారు. 2023 అక్టోబరు నుంచి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వరకు నిధులు మంజూరు కాలేదని సమాధానం ఇచ్చారు.



ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే ధ్యేయం



పాఠశాలను ప్రారంభిస్తున్న ఎంపీపీ ఉమాదేవి

సంస్థాన్ నారాయణపురం, జూన్ 18: ప్రతీ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ గుత్తా ఉమాదేవి అన్నారు. సంస్థాన్ నారాయణపురం మండలం వాచ్యతండాలో 12 సంవత్సరాల క్రితం మూసివేసిన ప్రభుత్వ పాఠశాలను బుధవారం ఎంపీపీ పునర్ ప్రారంభించారు. విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి పి.నాగవర్ధన్ రెడ్డి, వాచ్యాతండా పూర్వ విద్యార్థి, హైదరాబాద్ జీహెచ్ఎంసి డిప్యూటీ ఇంజనీర్ బన్సీలాల్, జిల్లా సెక్టోరియల్ అధికారులు శ్రీహరి అయ్యంగార్, పెసరు లింగారెడ్డి, మండల నోడల్ అధికారి శ్రీనివాసులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఉదయ, రమాదేవి, చలపతిరెడ్డి, సీఆర్పీలు దశరథ్, లింగస్వామి, ఎంఐఎస్ రమేష్ పాల్గొన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థి జీహెచ్ఎంసి డిప్యూటీ ఇంజనీర్ బన్సీలాల్ తన సొంత ఖర్చులతో పాఠశాలలో విద్యా వలంటీర్‌ను నియమిస్తానని ప్రకటించారు.

అభివృద్ధికి నిధులు కేటాయించాలి



సీఎంకు సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే సామేల్

మోత్కూరు, జూన్ 19: తుంగతుర్తి నియోజకవర్గం అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్యే మందుల సామేల్ కోరారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. నియోజకవర్గంలో పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

పట్టణాభివృద్ధికి పెద్ద పీట: ఎమ్మెల్యే



హౌజింగ్ బోర్డు కాలనీలో కాల్వల పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కుంభం

భువనగిరి రూరల్, జూన్ 19: వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో రూ.1కోటి ఎస్‌డిఎఫ్ నిధులతో అంతర్గత మురికి కాల్వల నిర్మాణ పనులు, రూ.2లక్షల జనరల్ ఫండ్, రూ.5లక్షల పట్టణ ప్రగతి నిధులతో చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని భువనగిరి పట్టణాన్ని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు తనవంతుగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, మునిసిపల్ కమిషనర్ పి.రామాంజులరెడ్డి, కౌన్సిలర్లు పోత్నక్ ప్రమోద్‌కుమార్, ఈరపాక నర్సింహ, జిట్ట వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు తంగెళ్లపల్లి రవికుమార్, బర్రె జహంగీర్, దొనకొండ వనిత, బెడ లాల్‌రాజ్, కూర వెంకటేష్, పిట్టల బాల్‌రాజ్, సాల్వేరు ఉపేందర్, కాలియ స్వాతి, బీసుకుంట్ల సత్యనారాయణ, కౌసర్, తదితరులు ఉన్నారు. అదే విధంగా మండలంలోని నందనం గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ ప్రహరీ నిర్మాణానికి, సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని నందనం ఎంపీటీసీ మట్ట పారిజాత శంకర్‌బాబు గౌడ్ ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కొండాపురం చంద్రమౌళిక, మట్ట బాలరాజు, నాగెళ్లి సత్యనారాయణగౌడ్ ఉన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



స్వర్ణగిరి ఆలయంలో చింతలకు ఆశీర్వచనం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి రూరల్, జూన్ 19: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతతతో పాటు శాంతీయుత సమాజం నెలకొంటుందని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం భువనగిరి మండలం అనంతారం శివారులోని స్వర్ణగిరి ఆలయంలో శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అర్చకులు ఆయనకు ఆశీర్వచనం చేశారు. ప్రజలు సుఖ సంతోషాలతో విరజిల్లే విధంగా భగవంతుడిని వేడుకున్నట్లు చింతల తెలిపారు. కార్యక్రమంలో ఆలయ జనరల్ మేనేజర్ మురళి కృష్ణ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కుతాడి సురేష్, వల్లపు విజయ్, గాజుల నవీన్, దండబోయిన బాలరాజు, కే నవిన్, శ్రీశైలం, నరేష్, శేమ, మనోహర్ ఉన్నారు.

భక్తులకు కొంగు బంగారం అయ్యప్ప ఆలయం

చౌటుప్పల్ టౌన్, జూన్ 19: చౌటుప్పల్ పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయం భక్తులకు కొంగు బంగారంగా మారిందని దేవాలయం వ్యవస్థాపక అధ్యక్షుడు బొబ్బిళ్ల మురళి అన్నారు. స్థానిక అయప్ప స్వామి ఆలయంలో రెండు రోజుల పాటు నిర్వహించిన 9వ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. ముగింపు రోజున సుప్రభాత సేవ, సామూహిక సత్యనారాయణ వ్రతాలు, దేవాలయం ఆర్చి శంకుస్థాపన, రమా సహిత సత్యనారాయణ స్వామి కల్యాణం, అయ్యప్ప స్వామి మహాపడి పూజ ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు.

గీత కార్మికులకు భద్రత మోకులు అందించాలి

భువనగిరి రూరల్, జూన్ 19: కల్లు గీత కార్మికులకు భద్రత మోకులు అందించి, వారికి రక్షణ కల్పించాలని చేతి వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ మాటూరి బాల్‌రాజ్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం భువనగిరిలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. గీత కార్మికులు ఎన్నో ఏళ్లుగా జీవనోపాధి కోసం తాటిచెట్లు ఎక్కుతూ ప్రమాదాల బారిన పడి మృతి చెందుతున్నారని, వారికి రక్షణ కల్పించేందుకు సేఫ్టీ మోకులను అందజేయాలన్నారు. 50 సంవత్సరాలు పైబడిన గీత కార్మికులకు వృత్తి పెన్షన్ అందజేయాలన్నారు. మృతి చెందిన వారికి వెంటనే ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. సమావేశంలో నాయకులు పాండాల మైసయ్య, మట్ట బాలరాజు, రంగ కొండల్, సోములు, అశోక్, భాస్కర్ ఉన్నారు.

సింగిల్ విండో చైర్మన్‌కు సన్మానం

మోత్కూరు, జూన్ 19: మోత్కూరు రైతు సేవా సహకార సంఘం (సింగిల్ విండో) చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన పేలపూడి వెంకటేశ్వర్లును బుధవారం సంఘం సిబ్బంది శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం సీఈవో కె.వరలక్ష్మీ, సిబ్బంది నరహరి, సందీప్, యాకూబ్, కిషన్‌రావు, సురేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాల మాజీ మంత్రి పరామర్శ

అడ్డగూడూరు, జూన్ 19: అడ్డగూడూరు మండల కేంద్రానికి చెందిన ఎంపీటీసీ పెండ్యాల భారతమ్మ భర్త ఎల్లయ్య (70) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో బుధవారం మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. లక్ష్మీదేవికాల్వ గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు కప్పల రాజేష్ తండ్రి రాములు ఇటీవల మృతి చెందడంతో దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను విరమించుకోవాలి

రాజాపేట, జూన్ 19: కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ జార్జన్ డిమాండ్ చేశారు. బుధవారం రాజాపేట మండల కేంద్రంలో కరపత్రాలను ఆవిష్కరించి, మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల 25వ తేదీన కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయాలన్నారు. నర్సింహులు, శ్రీశైలం ఉన్నారు.

రాహుల్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



భువనగిరిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి రూరల్, జూన్ 19: భావి భారత ప్రధాని రాహుల్ గాంధీని ప్రతీ ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్ర ఆసుపత్రి ఆవరణలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు పురస్కరించుకొని కేట్ కట్ చేసి రోగులకు పండ్లు, బ్రెడ్లను అందజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, ఎంపీపీ నరాల నిర్మల వెంకటస్వామి యాదవ్, కాంగ్రెస్ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ పోత్నక్ ప్రమోద్‌కుమార్, డీసీహెచ్‌వో చిన్నానాయక్, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు ఉన్నారు.

మోటకొండూర్ : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను బుధవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తలు అంబేద్కర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేవారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరబోయిన మల్లేష్ యాదవ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి మహేందర్, జిల్లా జాయింట్ సెక్రెటరీ భాస్కరుని రఘునాథ రాజు, రేగు చంద్రశేఖర్, వంగాల మల్లేష్‌గౌడ్, భూమండ్ల బంగారి, గిరబోయిన మల్కాయ్య, జంపాల నాగచందర్, జివిలికపల్లి రాములు, లోడె మల్లేష్, రాజశేఖర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన సందర్భంగా బుధవారం మండల కేద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ తండ మంగమ్మ, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి, నాయకులు కె.అనంతరెడ్డి, జె.నగేష్, ఎం.సిద్దయ్య, శేఖర్‌రెడ్డి ,పి.మల్లేశం, ఎన్.లక్ష్మారెడ్డి. కె.హన్మంత్, బి.ఉప్పలయ్య, వెంకట్‌రెడ్డి, యాదగిరి, నారాయణ, అనిల్, కిరణ్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయకులు పాల్గొన్నారు.

రాజాపేట: రాజాపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు బర్త్‌డే కేక్ ను కట్ చేసి, స్వీట్లను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ ప్రభుత్వ ప్రైవేట్ ఆసుపత్రుల్లో పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్‌గౌడ్, బస్వయ్య, కేదారి, శ్రీకాంత్, బక్కయ్య పాల్గొన్నారు.

అడ్డగూడూరు: మండల కేంద్రంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధి జన్మదిన వేడుకల్లో ముఖ్య అతిథిగా దామోదర్‌రెడ్డి పాల్గొని కేకు కట్ చేసీ బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో ఏఐసీసీ నాయకులు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గుడిపాటి నర్సయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వళ్లంభట్ల పూర్ణచందర్ రావు, నాయకులు నారగోని అంజయ్య గౌడ్, వంగాల సత్యనారాయణ, పూలపెల్లి సోమ్‌రెడ్డి, వళ్లంభట్ల రవి, కడారి రమేష్, పనుమటి దుర్గ, ముస్కు భిక్షంరెడ్డి, గూడేపు నాగరాజు, మరిశెట్టి మల్లేష్ ఉన్నారు.





మోటకొండూర్, ఆత్మకూరు(ఎం) మండల కేంద్రాల్లో కేక్ కట్‌చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బ్రహ్మోత్సవాలకు మంత్రి కోమటిరెడ్డికి ఆహ్వానం

మోత్కూరు, జూన్ 19: మోత్కూరు శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 21 నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న ఆలయ వార్షికోత్సవం, స్వామి వారి బ్రహోత్సవాలకు రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌ను ఆలయ కమిటీ ప్రతినిధులు ఆహ్వానించారు. బుధవారం రాత్రి హైద్రాబాదులో మంత్రి వెంకట్‌రెడ్డిని, అంతకు ముందు ఎమ్మెల్యే సామేల్‌ను కలిసి వారు ఆహ్వాన పత్రికలు అందజేశారు.

నేడు మండలానికి రానున్న ఎమ్మెల్యే

ఆత్మకూరు(ఎం) జూన్ 19: మండలంలో పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థానలు చేయడానికి ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గురువారం మండలానికి వస్తున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

'ఎమ్మార్పీఎస్ కవాతును విజయవంతం చేయాలి'

చౌటుప్పల్ టౌన్, జూన్ 19: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావం సందర్భంగా జూలై 7న తేదీన వరంగల్‌లో నిర్వహించే ఆత్మగౌరవ కవాతును విజయవంతం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి ఒక ప్రకటనలో కోరారు. మంద కృష్ణ నాయకత్వంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి 30 సంవత్సరాలు అవుతోందని, ఎస్సీ వర్గీకరణ కోసం నిరంతర పోరాటం సాగుతుందని ఆయన తెలిపారు.

విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలి

వలిగొండ, జూన్ 19: విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు వేముల నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శ్రీ చైతన్య పేరు చెప్పి అమాయక తల్లిదండ్రులను మోసం చేసి వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తూ అడ్మిషన్లు ప్రారంభిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఫర్దీన్, నరేందర్, శివ, సాయి, యూసూఫ్, తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ సికింద్రాబాద్ జిల్లా కన్వీనర్‌గా బాలకృష్ణ

వలిగొండ, జూన్ 19: మండలంలోని గోకారం గ్రామానికి చెందిన చెర్క బాలకృష్ణ ఏబీవీపీ సికింద్రాబాద్ జిల్లా కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఆయనకు నియామక పత్రాన్ని రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్ జానారెడ్డి అందజేశారు.

ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

వలిగొండ, జూన్ 19: మండలంలోని టేకుల సోమారం గ్రామం వద్ద ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై సంచరిస్తుండగా వారిని బుధవారం పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. తనిఖీ చేయగా వారి వద్ద ఒక చిన్న గంజాయి ప్యాకెట్ లభించినట్లు సమాచారం.

చేనేత పథకాలను కొనసాగించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న చేనేత కార్మిక సంఘం నాయకులు

మోత్కూరు, జూన్ 19: గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన చేనేత మిత్ర, చేనేతకు చేయూత, చేనేత బీమా తదితర పథకాలు కొనసాగించాలిని బుధవారం చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో మోత్కూరు తహసీల్దార్ రాంప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు వెంకటనర్సు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన (డిసెంబరు) నుంచి ఈ పథకాల అమలు నిలిచిపోయిందన్నారు. ఎన్నికలు నిర్వహించక పోవడంతో చేనేత సహకార సంఘాలు నిర్వీర్యమైపోయాయన్నారు. సంఘాలు కార్మికులకు పని కల్పించడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం చేనేత వస్త్రాలు, ముడి సరకులపై విధించిన జీఎస్టీని రద్దు చేయాలని, చేనేత సంఘాల్లో, కార్మికుల వద్ద నిల్వ ఉన్న వస్త్రాలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, చేనేత సహకార సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జెల్లా నాందేవ్, చింతకింది సోమరాజు, పారుపల్లి నాగరాజు, జెల్ల సుదర్శన్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగించాలి

● ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య





యాదగిరిగుట్ట మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అయిలయ్య, రాజాపేటలో అయిలయ్యను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

యాదగిరిగుట్ట రూరల్, జూన్ 19: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించి, నమ్మకం కలిగించాలని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. బుధవారం గుట్ట మండల చివరి సర్వసభ్య సమావేశం ఎంపీపీ చీర శ్రీశైలం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గానికి ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలతో పాటుగా ఆయా పాఠశాలల్లోని మౌలిక సదుపాయాలు కల్పించడానికి సీఎం రేవంత్‌రెడ్డి ద్వారా రూ.2.20కోట్లను కేటాయించారని, అయినప్పటికీ ఆరు మండలాలల ఇన్‌చార్జి ఎంఈవోలు ఇప్పటి వరకు తనకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాఠశాలను సందర్శించి వాటి పనితీరు ఎప్పటికప్పుడు తెలపాలని, ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకవస్తే వాటిని సత్వరమే పరిష్కరిస్తానని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా 25 అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించి శంకుస్థాపనలు చేశామని, స్థానిక పంచాయతీ ఏఈ నిర్లక్ష్యం చేస్తున్నారని, తక్షణమే వాటిని పూర్తి చేయాలని కోరారు. నియోజకవర్గ వ్యాప్తంగా అందరం కలిసి అభివృద్ధికి పాల్పడుతూ ఆలేరును రాష్ట్రంలోనే ముందు వరుసలో నిలబెడదామని అన్నారు. వర్షా కాలం ప్రారంభం అయినందున సీజన్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, స్థానిక మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది అప్రమత్తమై గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజలను చైతన్య పరుస్తూ, అవసరమైన వారికి వెంటనే వైద్యం అందించాలని ఆదేశాలు జారీచేశారు. ఐదు సంవత్సరాలుగా మండల పరిషత్ అధ్యక్షుడు చీర శ్రీశైలం పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేశారని, ఆయన అందరినీ కలుపుకొని పోయి ఎలాంటి వివాదాలకు తావ్వికుండా చక్కగా పరిపాలించినందుకు ఆయనను, పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పలు శాఖ అధికారులు తమ తమ శాఖల పనితీరును సభలో వివరించారు. సమావేశంలో ఎంపీపీ చీర శ్రీశైలం, జడ్పీటీసీ సభ్యురాలు తోటకూరి అనురాధబీరయ్య, ఎంపీడీవో నవీన్‌కుమార్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సీఐ రమేష్ పాల్గొన్నారు.

ఆదర్శంగా తీర్చిదిద్దుతా: ప్రభుత్వ విప్

రాజాపేట: ఆలేరు ప్రజలు తనను ఆశీర్వదించి గెలిపించారని ఆలేరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటానని ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. బుధవారం రాజాపేట ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సర్వ సభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. తను నాయకుడిని కాదని సేవకుడిగా ప్రజల సమస్యలు పరిష్కరించడమే తమ కర్తవ్యమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్యానికి ప్రాధాన్యం కల్పిస్తోందని గత ప్రభుత్వాలు అభివృద్ధిని పట్టించుకోలేదని, శిలా ఫలకాలకే పరిమితమయ్యాయని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల సౌకర్యాల కోసం రూ.11.20కోట్లు నిధులు మంజూరు చేశామని తెలిపారు. గత ప్రభుత్వాలు రోడ్లను పట్టించుకోలేదని, రాజాపేట మండలంలో వాగులపై బ్రిడ్జిల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేశామని, పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఎమ్మెల్యేను ఎంపీటీసీలు, అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ గోపగాని బాలమణియాదగిరిగౌడ్, జడ్పీటీసీ చామకూర గోపాల్, వైస్ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో నాగమణి, తహసీల్దార్ దామోదర్, ఏవో మాధవి, ఎంపీటీసీలు రాజు, నరేష్‌రెడ్డి, రేణుక, శ్రీలత పాల్గొన్నారు.

మట్టి ఇసుక దందాపై చర్యలేవి..?

రాజాపేట మండలంలో చెరువులు కుంటలు అక్రమాలకు గురవుతున్నాయని మట్టి ఇసుక దందా వ్యాపారం జోరుగా సాగుతుందని చర్యలు తీసుకోవాలని మండల సభ్యులు డిమాండ్ చేశారు. మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ గోపగాని బాలమణి అధ్యక్షతన జరిగింది. మండలంలోని దూదివెంకటాపూర్ సోమిరెడ్డి కుంట, శిఖం భూమి ఆక్రమణకు గురైందని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని మట్టి ఇసుక దందా అధికారుల కనుసన్నల్లో పెరుగుతుందని రాజాపేట ఎంపీటీసీ దాచెపల్లి రాజు, జడ్పీటీసీ గోపాల్, ఆరోపించారు. బేగంపేట, నెమిల చెరువుల్లో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని రాత్రిపూట టిప్పర్లతో మట్టిని తరలిస్తున్నారన్నారు. అధికారులు చర్యలు చేపట్టాలని సభ్యులు డిమాండ్ చేశారు. మండల సర్వసభ్య సమావేశానికి పై స్థాయి అధికారులు సమావేశానికి హాజరు కాకుండా కింది స్థాయి సిబ్బందిని సమావేశానికి పంపి మొక్కుబడిగా వ్యవహరిస్తున్నారని సభ్యులు పేర్కొన్నారు. మండల సమావేశాలపై తీర్మాణం చేస్తున్న సమస్యలు పరిష్కారం కావడం లేదని సభ్యులు అధికారులపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వైస్ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీలు రాజు, నరేష్‌రెడ్డి, దేవిక, రేణుక, రాంరెడ్డి, శ్రీలత, పాల్గొన్నారు.



రాజాపేట: సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న అధికారులు